

వివరాలు మెయిన్‌లో

16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 26 సెప్టెంబరు , 2026 | పేజీలు : 7

## కాళేశ్వరం నీళ్లను గజ్వేల్‌కు
# తన్నుకుపోయారు

బీర్ల ఐలయ్య ధ్వజం

మాజీ ఎమ్మెల్యేకు పదవులు పోయాక పిచ్చెక్కింది

ఏ చెరువు నింపావో చెప్పే ధైర్యం ఉందా?

నియోజకవర్గాన్ని నాశనం చేసిన బిఆర్ఎస్ నేతలకు బుద్ధి చెబుతాం



**ప్రజాపక్షం/ యాదగిరిగుట్ట :** అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో తీవ్ర అక్రమాలకు పాల్పడి, పదవులు ఊడిపోవడంతో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి దంపతులకు పిచ్చెక్కి రోడ్ల మీద తిరుగుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తానే నియోజకవర్గంలోని చెరువులన్నీ నింపానని మాజీ ఎమ్మెల్యే సునీత మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. 'ఏ చెరువు నింపావో చెప్పే ధైర్యం నీకు ఉందా? కడుపు నిండా కాళేశ్వరం నీళ్లు కట్టుకుని గజ్వేల్లో హారతులు పట్టి, పటాకులు కాల్చి నీళ్లను అక్కడికి తన్నుకుపోయింది మీ మాజీ మంత్రి హరీష్ రావు కాదా?' అని ప్రశ్నించారు. మోటకొండూర్ చెరువు వద్దకు వచ్చి తానే తవ్వించానని చెబుతున్నారని, తాను చిన్నప్పటి నుంచి బుల్లై తిరిగిన ఆ పురాతన చెరువు మాజీ ఎమ్మెల్యే తాత తవ్వించిందా? అని ప్రశ్నించారు. ఈ ఏడాదీ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో నీళ్లను ఎత్తిపోసి ప్రతి చెరువునూ నింపే బాధ్యతను తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. తనకు ఫామ్హౌస్లు, బంగ్లాలు లేవని బీరాలు పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు ధర్మాధికారి గుడి వద్ద 40 ఎకరాల భూమిని ఎలా ఆక్రమించుకున్నారో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. వంగపల్లి పీరప్ప గుడి వద్ద ఫామ్హౌస్ ఎలా కట్టారు, మాసాయిపేటలో 10 ఎకరాల ఆక్రమణల సంగతి ఏమిటని నిలదీశారు. తన స్వగ్రామమైన ఎన్కలలో తనకు ఇల్లు ఉంటే అక్కడికే వెళ్తానని, తాను రాజకీయాల్లోకి రాకముందు నుంచే వ్యాపారం చేసి సంపాదించిన దాంట్లోనే ప్రజలకు సేవ చేస్తున్నానని స్పష్టం చేశారు.

**అభివృద్ధిపై పోటీ పడదాం చొక్కాలు పట్టుకోవడం కాదు**

రైతులు నమ్మి మాజీ ఎమ్మెల్యేకు రెండుసార్లు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని దోచుకున్నారని, తనను ఒకసారి గెలిపించినందుకు ఆలేరును రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు కష్టపడుతున్నానని బీర్ల ఐలయ్య తెలిపారు. 'ఎలక్షన్లు రాగానే చొక్కాలు పట్టుకోవడం, పార్టీలు మారడం కాదు... నీ పార్టీలోని నాలుగు గ్రూపులు, దందాలు బంద్ చేసి దమ్ముంటే అభివృద్ధిపై పోటీ పడు' అని సవాల్ విసిరారు. సొసైటీలో జరిగిన ₹23 లక్షల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, రైతుల కష్టార్జితాన్ని తిన్న వారి నుంచి కక్కిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం, అండెం సంజీవరెడ్డి, నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, పెలిమెల్లి శ్రీధర్ గౌడ్, హేమెంధర్ పాల్గొన్నారు.

**రేషన్ కార్డే పేదలకు కొండంత భరోసా**

అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో రేషన్ కార్డులు ఎంతో కీలకమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



## వ్యవసాయ ఉత్పత్తుల ద్వారానే రైతులకు అధిక ఆదాయం

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల కార్యదర్శి కె. సురేంద్రమోహన్

నల్లగొండ జిల్లాలో 62 డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రతి వ్యవసాయ ఉత్పత్తి ద్వారా రైతుకు అధిక ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల కార్యదర్శి కె. సురేంద్రమోహన్ అన్నారు.శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సబ్సిడీ పథకాలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ఐడీని తప్పనిసరి చేసినందున యుద్ధ ప్రాతిపదికన నెల రోజుల్లో దాన్ని పూర్తి చేయాలి.సబ్సిడీ ఎరువులు ఏ పరిస్థితిలోనూ పక్కదారి పట్టరాదు. పట్టించే వారిని గుర్తించి అరెస్టు చేయాలి.రాష్ట్రంలో 80 ఎఫ్‌పీఓలు ఉండి 3,120 కోట్ల ఎగుమతి వ్యాపారం చేస్తున్నాయని, దాన్ని 5 వేల కోట్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.ఎఫ్‌పీఓలు కొనుగోలు,అమ్మకమే కాకుండా నిల్వ, ప్రాసెసింగ్, ఎగుమతి స్థాయికి వెళితేనే దళారుల బెడద తగ్గి లాభాలు రైతులకు చేరుతాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఎఫ్‌పీఓలుగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55,నల్లగొండ జిల్లాలో 62 డిజిటల్ క్రాప్ సర్వే పూర్తయిందని, మిగిలినది వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల వివరాలను తెలియజేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి కన్నెర్ర... అప్పుల ఉచ్చు

మేళ్లచెరువులో పత్తి రైతుల బతుకులు ఛిద్రం

**ప్రజాపక్షం/మేళ్ళచెరువు :** మండలంలోని పత్తి సాగు చేసిన అన్నదాతల పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా మారింది. నిన్న మొన్నటి వరకు వాతావరణంలో వచ్చిన మార్పులు వర్షాలు లేకపోవడం, విపరీతమైన ఎండల తీవ్రత వల్ల పత్తి చేలు ఎదగక ఆందోళన చెందుతున్న రైతులకు ప్రస్తుతం కురుస్తున్న అకాల తుఫాను కోలుకోలేని దెబ్బతీసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మేళ్లచెరువు పరిధిలోని వందలాది ఎకరాల్లో సాగైన పత్తిపంట పూర్తిగా నాశనమైంది.

**పెట్టుబడులు మట్టిపాలు...** ఈ ఏడాది ఎలాగైనై పత్తి పంట చేతికి వస్తుందని ఆశతో ప్రకృతిని నమ్ముకుని ఎకరాకు వేల రూపాయల చొప్పున రైతులు పెట్టుబడులను పెట్టారు. ముఖ్యంగా సొంత భూమి లేక ఎకరాకు వేల రూపాయలను కౌలుగా చెల్లించి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అటు భూ యజమానికి కౌలు డబ్బులు చెల్లించి ఇటు విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం తెచ్చిన పెట్టుబడి అంత ఇప్పుడు నీటపాలైంది. గతంలో ఎన్నడూ ఏ సంవత్సరంలోనూ పత్తి పంటకు ఈ స్థాయిలో నష్టం వాటిల్ల లేదని రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ప్రకృతి తమపై ఇంతగా కక్ష సాధిస్తుందని ఊహించుకోలేకపోయమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కొండల్లా వడ్డీలు... ఊబిలా మారుతున్న అప్పులు...**

పంటలు చేతికి రాకపోయినా సాగుకోసం బ్యాంకుల నుండి తెచ్చిన అప్పులతాలూకు వడ్డీలు మాత్రం కొండలను తలపించే విధంగా రోజురోజుకు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. అసలే పెట్టుపడి పోయి దిక్కుతోచని స్థితిలో ఉంటే వడ్డీ భారం తమను నిలువునా ముంచేస్తుందని, కుటుంబాలు గడవడం కూడా కష్టంగా మారిందని రైతాంగం తీవ్ర ఆవేదన చెందుతుంది. పంటపోయి అప్పుల కట్టే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర మానసిక క్షోభని అనుభవిస్తున్నారు.

**తక్షణమే నష్టంపై సర్వే జరుపాలి...**

ప్రకృతి వైపరీత్యంతో సర్వస్వం కోల్పోయిన తమను ప్రభుత్వమే మానవతా దృక్పథంతో ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఈ నష్టంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల చేత క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించి ఎకరాకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించి తమను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాలని అన్నదాతలు కోరుతున్నారు.





## పోషక విలువలు అవసరం

ప్రజాపక్షం/నేరేడుచర్ల : పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్. రాజ్యలక్ష్మి అన్నారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం నేరేడుచర్ల 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో మెదడు, శారీరక ఎదుగుదల వేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఫించన్లు మంజూరు చేయాలి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం అక్టోబర్ నెలలో ఇవ్వనున్న వృత్తి ఫించన్లలో భాగంగా గీత కార్మికులకు టిసిఎస్ టిఫ్‌టి లైసెన్సులు రెన్యూవల్‌తో సంబంధం లేకుండా నూతన ఫించన్లు మంజూరు చేయాలని రాష్ట్ర గీత పనివారల సంఘం కమిటి సభ్యులు పాలకూరి బాబు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గీత వృత్తిదారుల పన్నులు రద్దు చేసి ఏదో ఘనకార్యం చేసినట్లు చేసి గీత కార్మికులకు అన్ని విధాలుగా నష్టపరిచిందని, పరోక్షంగా వృత్తిమీద గీత కార్మికులకు అధికారం లేకుండా చేసి మద్యం అమ్మకాలు పెంచుకున్నారని ఆరోపించారు. గీత కార్మికులు పన్నులు రద్దుపట్ల సంతోషించారు కానీ జరగబోయే నష్టాన్ని గుర్తించలేకపోయారని వివరించారు. లైసెన్సుల రెన్యువల్‌తో సంబంధం లేకుండా అర్హులైన గీత కార్మికులందరికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.

## జావెలిన్ త్రోలో నూర్జహాన్ పేట కెరటం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతం నుండి మరో క్రీడా ఆణిముత్యం వెలుగులోకి వచ్చింది. మండలంలోని నూర్జహాన్‌పేట గ్రామానికి చెందిన యువ అథ్లెట్ పానుగోతు కార్తీక్ జావెలిన్ త్రో విభాగంలో అద్భుత ప్రదర్శనతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈనెల 22వ తేదీన రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ పట్టణంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ సెలెక్షన్స్‌లో కార్తీక్ పాల్గొని రాష్ట్రస్థాయి పోటీల టికెట్‌ను కైవసం చేసుకున్నాడు. జిల్లాస్థాయిలో ఘన విజయం సాధించిన కార్తీక్ ఈనెల 26, 27 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ అసోసియేషన్ మీట్‌లో రంగారెడ్డి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



## ఎంఆర్‌పిఎస్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాపక్షం/మోటకొండూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎస్సీలకు అమలు చేస్తానన్న ప్రభుత్వ పథకాలు అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 5న అడ్డగూడూర్ మండల కేంద్రం నుండి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం వరకు జరిగే బైక్ ర్యాలీని ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ర్యాలీకి సంబంధించిన కరపత్రం విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ మహిళలకు అభయహస్తం, అసైన్డ్ భూములను పట్టాలుగా మార్చడం లాంటి అనేక హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బైరపాకనాగరాజు, రాష్ట్ర కార్యదర్శి సంఘీ స్వామి, మాదిగ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యానగల్ల రమేష్, మాదిగ, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి వెంకట్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం మహేందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు పోలేపాక బిక్షపతి,జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల అనిల్ పాల్గొన్నారు.



## చదువుకున్న పాఠశాలకు చేయూత



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడం పూర్వ విద్యార్థిగా తన బాధ్యత అని వైఆర్‌పి ఫౌండేషన్ అధినేత ఏలిశాల రవిప్రసాద్ అన్నారు.పట్టణంలోని రామగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం పూర్వ విద్యార్థిగా ఆయన సందర్శించారు. పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటించి,వారికి,పాఠశాలకు అవసరమైన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే తన సొంత నిధులతో ఒక లక్ష యాభై వేల రూపాయలు విరాళం అందించి పాఠశాలను అభివృద్ధి పరచడం జరిగిందని తెలిపారు..48 వ డివిజన్ కార్పొరేటర్ యామా కవిత దయాకర్ మాట్లాడుతూ డబ్బున్న వారు ఎంతో మంది ఉన్నప్పటికీ, తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా ఖర్చు చేసే గుణం కలిగి ఉండటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి,కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ,అడ్వకేట్ జిల్లేపల్లి రాఘవ,గుత్తా రవీందర్, గార్లపాటి పురుషోత్తం,వైఆర్‌పి ఫౌండేషన్ టీం సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 'నషా ముక్త్ యువా' అవగాహన సదస్సు

ప్రజాపక్షం/రామన్నపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతలో మాదకద్రవ్యాల వ్యసనంపై అవగాహన కల్పించేందుకు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో'నషా ముక్త్ యువా ఫర్ విక్షిత్ భారత్'కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు మరియు వైద్య అధికారి గోపాల్ ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు,శారీరక ఆరోగ్యం మరియు పౌష్టికాహార ప్రాముఖ్యతపై వారు విస్తృతంగా అవగాహన కల్పించారు.ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం అతిథులతో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు అశోక్ కుమార్ మరియు అశోక్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మాలే వెంకట్ రెడ్డి,పున్నారావు,మందడి వెంకట్ రెడ్డి,నిర్మల, కిరణ్,నరసింహారావు,కవిత, నగేష్,కరుణ,ఉమారాణి,శ్రవణ్ కుమార్,పరశురాములు, నాగమణి, జానయ్య, నరసయ్య,పుష్పలత,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ అండ్ బీ ఈఈకి సర్పంచుల వినతి



ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ, ఇంద్రపాలనగరం గ్రామాల పరిధిలో గుంతలమయంగా మారి ప్రజలకు,వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతూ పల్లివాడ, మునిపంపుల గ్రామాల సర్పంచులు కమ్మంపాటి శ్రీనివాసులు,బొడ్డుపల్లి వెంకటేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్అండ్బీ ఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ రోడ్లు పూర్తిగా ధ్వంసమై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో నిత్యం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు,విద్యార్థులు, రైతులు,ప్రయాణికులు ప్రమాదాల బారినపడే పరిస్థితి నెలకొందన్నారు. వర్షాలు పడిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రోడ్డు ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు అత్యంత కీలకమైన ఈ రోడ్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,తక్షణమే గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన చోట రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రోడ్ల సమస్యపై ప్రభుత్వం, ఆర్ అండ్ బి శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు. వీరి వెంట ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రమ్ ఉన్నారు.



## 43వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం 43వ రోజుకు చేరుకుంది. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో దీక్షలో కూర్చోగా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వస్తుందని రెండు నెలలుగా కొనసాగుతున్న ఉద్యమాన్ని ఆధారం చేసుకొని ఆశిస్తున్న సూర్యాపేట ప్రజల ఆకాంక్షను నిర్లక్ష్యం చేస్తున్న నేతల ఇళ్ల ముట్టడి చేయాలని డిమాండ్ చేశారు.ఈ దీక్షలో పట్టణ కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పేర్ల నాగయ్య, ఎర్ర అఖిల్, గులాం హుస్సేన్, శేషగిరి, పద్మ, చంద్రకళ తదితరులు దీక్షలో పాల్గొనగా పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయినాల కృష్ణారావు, చలమల నరసింహ, వెలుగు వనిత, డేవిడ్ కుమార్, బూర వెంకటేశ్వర్లు తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు.

## వినాయకుడికి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : గణేష్ ని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని దేవరకొండ రోడ్‌లో వీర శివాంజనేయ సేన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని ఆటపాటలతో శోభాయాత్రను కొనసాగించారు.ఈ సందర్భంగా ఆ డివిజన్ కార్పొరేటర్ నవ్య శ్రీ రాఖీ మాట్లాడుతూ గణేష్ ని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని నిమజ్జనం శోభాయాత్రను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నిర్వాహకులు సిహెచ్ లోహిత్ రెడ్డి, సందీప్, సజిత్,కోటి,సాయి,భరత్ రెడ్డి,నాగార్జున రెడ్డి,శ్రవణ్, రజిని,స్వరూప, వనిత, జ్యోతి, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.

## వైకేఆర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జన శోభాయాత్ర



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : గణేష్ ని ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని యాటకన్నారెడ్డి కాలనీలో వై. కే. ఆర్. యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం లడ్డును వేలంపాట వేశారు. 70 వేల రూపాయలకు ఎలిమినేటి రోహిత్ రెడ్డి వినాయక లడ్డును దక్కించుకున్నారు. అదేవిధంగా మరొక లడ్డును లక్ష్మారెడ్డి 30 వేల రూపాయలకు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గణేష్ నిమజ్జనం శోభాయాత్రను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వినయ్,భాను,నిఖిల్ రెడ్డి,అభిరామ్, బన్నీ, వినీత్, తరుణ్ నర్సిరెడ్డి, సునీత, వెంకట్ రెడ్డి ఉన్నారు.

## వినాయకుని పూజలో ఎల్లెంల

ప్రజాపక్షం/మోటకొండూర్ : మోటకొండూరు మండలంలోని చంద పల్లిలో ఏకదంతాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకునికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎల్లెంల సంజీవరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏకాదంతాయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సహజ వ్యవసాయం రైతు అభివృద్ధికి జీవనోపాధి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలో మహమ్మదాబాద్ ఎన్ఎంఎన్ఎఫ్ జాతీయ సహజ వ్యవసాయ మిషన్ మూడవరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సహజ వ్యవసాయం, కూరగాయల సాగు, మోడల్ డెమో ఫారమ్స్, వ్యవసాయ పద్ధతులు మరియు సహజ వ్యవసాయ సాంకేతికతలపై ప్రయోగిక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిమ్మల రామచంద్ర మిత్రా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్లాడుతూ రైతు ఆరోగ్యం నేల ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ నిజమైన వ్యవసాయం లక్ష్యాలతో సహజ వ్యవసాయాన్ని గ్రామస్థాయిలో విస్తరం చేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని మాట్లాడారు. వ్యవసాయ మండల అధికారి బి.పూజ, రాకేష్, అర్టికల్చర్ అధికారి కవిత, మండల పశువైద్య అధికారి బాలకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ విక్రం, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వైస్ చైర్మన్‌గా రాచకొండ రమేష్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ 131వ వైస్ చైర్మన్ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన రాచ కొండ రమేష్‌ను వైస్ చైర్మన్‌గా ఎంపిక జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి నల్ల గొండ జిల్లా నుండి రజక వృత్తిదారులు వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న రవీంద్రభారతిలో జరిగే ఉత్సవాల కమిటీకి ఆహ్వానించడం జరిగిందని రమేష్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, రజక కార్పొరేషన్ చైర్మన్ దాసరాజు అజయ్ కుమార్‌కు రాచకొండ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. చాకలి ఐలమ్మ ఉత్సవాల వైస్ చైర్మన్‌గా ఎంపికచేసిన రజక సంఘాల నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధానాచార్యులకు అభినందనలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం రామన్నపేట లైన్స్ క్లబ్ వారిచే గురువారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రధానా చార్యులు పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.రత్న మంజుల మాట్లాడుతూ అధ్యాపకులుగా, ప్రధానాచార్యులుగా 28 ఏళ్ల సుదీర్ఘ ప్రయా ణంలో ఎంతోమంది విద్యార్థులకు చక్కని విద్యను అందించడమే కాకుండా వారిని ఉన్నత వ్యక్తులుగా ఆచార్య రాహత్ ఖానం తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ ఎం.రవీందర్ రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.కిషన్,ఐ క్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మి నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్ తోపాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



## న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను బార్ కౌన్సిల్ చైర్మన్‌గా తన కర్తవ్యంగా పరిష్కరిస్తానని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ సాముల రాంరెడ్డి న్యాయవాదులకు హామీ ఇచ్చారు. శుక్రవారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనకు అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, అవసరమైతే తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల సహకారాన్ని కూడా తీసుకుంటానని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను అన్ని విధాలుగా తన శక్తి మేరకు అభివృద్ధి పరుస్తానని ఆయన తెలిపారు. హుజూర్‌నగర్ న్యాయవాదులు లేకుండా తాను లేనని, తాను ఇక్కడి న్యాయవాదులలో ఒకనిగా గుర్తించుకోవాలన్నారు. తన గెలుపుకు అహర్నిశలు కృషి చేసిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. హుజూర్‌నగర్‌కు మరొక రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఓ జారీ చేసిందన్నారు. దీంతో హుజూర్‌నగర్‌లో న్యాయస్థానాల సంఖ్య 9 కి న్యాయమూర్తుల సంఖ్య కూడా 9కి పెరిగిందన్నారు. జిల్లా రెండవ న్యాయమూర్తి డాక్టర్ శివ రామ ప్రసాద్ మాట్లాడుతూ రాంరెడ్డి గెలుపుకు న్యాయవాదుల కృషితోపాటు దైవబలం తోడైందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాస రావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బొబ్బ కోటిరెడ్డి, కుక్కడపు బాలకృష్ణ, సీనియర్ ఏజిపి రేణుకాదేవి, బానోతు సురేష్ నాయక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జక్కుల వీరయ్య, సిఐ చరమంద రాజు, ఎస్ఐ చలికంటి నరేష్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సుదీర్ఘ అండ ఎస్‌టియుటిఎస్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తన ఆవిర్భావ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆదర్శాలు, విలువలకు కట్టుబడి 80 వసంతాల సుదీర్ఘ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న భారతదేశంలోని తొలి ఉపాధ్యాయ సంఘంగా స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియుటిఎస్) ప్రత్యేక గుర్తింపు పొందిందని బంగారుగడ్డ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పల్సాటి లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం బంగారుగడ్డ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌టియుటిఎస్ మిర్యాలగూడ మండల శాఖ అధ్యక్షులు అంబటి వీరనారాయణ ఆధ్వర్యంలో పాఠశాలలో 80 వసంతాల వైభవోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హక్కుల సాధనలో, విద్యారంగ పరిరక్షణలో సంఘం అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో కూడా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఈ సంఘం ముందుపీఠిన నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎండి. ఫెరోజ్, ఆర్.రాంసింగ్, వి.సైదిరెడ్డి, కె.యల్లమ్మ, ఎల్.లక్ష్మ, నాగేశ్వర శాస్త్రి, ఎ.శ్రీనివాస్, ఎన్.అంజయ్య, ఎండి.నసీమాబేగం పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుపై ఆరోపణలు సరికాదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఆయన కుటుంబసభ్యులపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండి.యూసుఫ్, కుందూరు వీరకోటిరెడ్డి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికార యంత్రాంగం కాంగ్రెస్ చేతిలోనే ఉన్నందున ఆరోపణల్లో నిజముంటే తక్షణమే సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సవాలు విసిరారు. భాస్కర్‌రావు కుటుంబసభ్యులకు చెందిన వెంగమాంబ క్రషర్ వ్యాపార సంస్థ అని, దానికి రాజకీయాలను ముడిపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రాజకీయం చేసే ప్రతి ఒక్కరూ వ్యాపార రంగంలో ఉన్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార బలాన్ని ఉపయోగించి వెంగమాంబ క్రషర్‌ను మూసివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా రూ.12 కోట్లు పన్నులు చెల్లించిన ఏకైక క్రషర్ వెంగమాంబ క్రషర్స్ మాత్రమేనని గుర్తుచేశారు. వైటీపీఎస్ నిర్మాణంపై రూ.750 కోట్లు అక్రమాలు జరిగాయని చేస్తున్న ప్రకటనలపై దమ్ముంటే ఎంక్వైరీ వేయించి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడితే ప్రజల ముందు నవ్వుల పాలు కాక తప్పదని హెచ్చరించారు.. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు హాజీరాం, పొచ్చునాయక్, సోమ సైదిరెడ్డి, అశోక్, సంపత్, కొండారపు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నెలకు రూ.1500పెన్షన్



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** అధికారం అంటే హోదా కాదు...బాధ్యత అని నిరూపిస్తున్నారు ఆ గ్రామ సర్పంచ్.ప్రభుత్వం ఇచ్చే పథకాలకే పరిమితం కాకుండా తన సొంత జేబు నుండి ఒక నిరుపేద వృద్ధుడికి ప్రతి నెలా పెన్షన్ ఇస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.ఆ సర్పంచే కాకి శ్రీలత సుందరయ్య. మండలంలోని పంతంగి గ్రామ సర్పంచ్‌గా గత ఏడాది ప్రజల మద్దతుతో ఎన్నిక్యారు. గ్రామంలో నిరుపేద వృద్ధుడికి సహాయం చేయాలని నిర్ణయించుకుని ప్రతి నెల తనకు వచ్చే జీతం నుండి రూ.1500 ఇస్తామని ప్రకటించి గత నాలుగు నెలలుగా పెన్షన్‌గా ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.శ్రీలత సుందరయ్య చేస్తున్న మంచి పనిని గ్రామస్తులు పార్టీలకతీతంగా అభినందిస్తున్నారు. నిజానికి సర్పంచ్ పదవి అంటే చాలా మంది కాంట్రాక్టులు,బిల్లులు అని చూస్తారు.కానీ శ్రీలత సుందరయ్య లాంటి వారు పదవికి మానవత్వాన్ని జోడించి, గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతున్నారు.



## కుక్కలు, కోతులు, పందులను పట్టి ప్రజలను కాపాడాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలో కుక్కలు, కోతులు, పందులను పట్టి ప్రజలను కాపాడాలని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం భువనగిరిలో మున్సిపల్ కార్యాలయంలో డీఈకి బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల పైన దాడి చేయడం జరుగుతుందని, వార్డులలో పందుల సంచారం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గతం లో బిఆర్ఎస్ పార్టీ తరుపున ధర్నాలు చేయగానే మున్సిపల్ అధికారులు నామమాత్రంగా కొన్ని పట్టి మిగిలినవి వదిలేయడం జరిగిందన్నారు. ప్రతి వార్డులో ఉన్న కుక్కలను కోతులను, పందులను మొత్తం 2, 3 రోజులలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి 35 వార్డులలో ఉన్న కుక్కలు, కోతులు, పందులను పట్టి భువనగిరి పట్టణ ప్రజలను కాపాడాలని లేని యడల బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు రచ్చ శ్రీనివాస్, ఇండ్ల శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

## పేదలకు వరంగా బిఆర్అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని, పేద విద్యార్థులకు ఈ విశ్వవిద్యాలయం గొప్ప వరమని ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి బి.ధర్మానాయక్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని కెవిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో నిర్వహించిన కౌన్సిలర్లు, విలేకరుల సమాచార సమావేశంలో మాట్లాడారు. దూరవిద్య ద్వారా విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మారుతున్న ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను విశ్వవిద్యాలయం వేగంగా అందుబాటులోకి తెస్తోందని వివరించారు. ప్రస్తుత 2026 విద్యా సంవత్సరానికి గాను యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రధానాచార్యులు మల్లిరెడ్డి భీమర్జున రెడ్డి, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ పి. నాగరాజు, జాక్టో ప్రతినిధి ఎం. వెంకన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## దివిస్ పరిశ్రమ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివిస్ పరిశ్రమ అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని మునిసిపల్ కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్,ఊదరి యాదయ్య,గడ్డం రాజరత్నం, ఆలేశ్రీలత చిరంజీవి లు అన్నారు. తంగడపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం,నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.రూ.2,12,318 విలువైన నోట్‌బుక్స్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, నరేష్,కాటం రాజు,విద్యాకమిటీ చైర్మన్ పద్మ,జహంగిరి, ప్రధానోపాధ్యాయులు భార్గవి,వెంకటరెడ్డి, దివిస్ ప్రతినిధులు బి.గోపి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## ఫార్మసీదే కీలకపాత్ర

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రజారోగ్య జీవితంలో ఫార్మసీదే కీలకపాత్రని పోచంపల్లి మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు అమృతం అశోక్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా శుక్రవారం అసోసియేషన్ సభ్యులు ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి గడ్డం వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అసోసియేషన్ ప్రతినిధులు సోమవరపు లక్ష్మీ నారాయణ ఆర్ ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి ఎర్రమాద శంకర్ బండి రవికుమార్ బి రాజు చెరుకు ఆనంద్ శ్రవణ్ ఎస్ కె రెయాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని సోలిపేట, దుర్గా నగర్ కాలనీ, రాముని తండా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం ఘనంగాబ నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గణపతి బప్పా మోరియా అంటూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మందల రామస్వామి, ఇంద్రసేనారెడ్డి, ఉప్పల వినోద్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, వార్డు మెంబర్ స్వామి నాయక్, రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రవీందర్ రెడ్డి స్వామి నాయక్, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు తప్పక వస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బిజెపి యువ మోర్చా తుర్కపల్లి మండల అధ్యక్షునిగా మాలోతు సురేష్ నాయాక్‌ను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రమేష్ నాయక్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, మేకల పాండు యాదవ్, కానుగంటి భాను యాదవ్, పాల్గొన్నారు.

## ఐలమ్మ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా లింగయ్య

**ప్రజాపక్షం/ మర్రిగూడ :** వీరనారి చిట్యాల ఐలమ్మ131వ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన పగడాల లింగయ్య నియమితులయ్యారు ఈ నెల 26న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో పగడాల లింగయ్యను రాష్ట్ర కన్వీనర్ గా ప్రభుత్వం నియమించింది ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గా నియమితులైన పగడాల లింగయ్య ను పలువురు అభినందించారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** తినుబండారాల తయారీలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆహార భద్రత అధికారి డాక్టర్ శివశంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సామాజిక తనిఖీల్లో భాగంగా శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న సంజయ్ బేకరీలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బేకరీలో తనిఖీలు చేపట్టగా తినడానికి పనికిరాని ఆహార పదార్థాలు నిల్వ ఉంచినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్రిడ్జ్, హీటర్లు, తయారీ కేంద్రంలో చెత్తాచెదారం పేరుకు పోవడంతో పాటు, బూజు పట్టిన ముడి పదార్థాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. బేకరీలో లభించిన పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్కు పంపిస్తున్నట్లు తెలిపారు. కాలం చెల్లిన, బూజు పట్టిన కేకులు, స్వీట్లు, బిస్కెట్లు, ముడి సరుకులను గ్రామపంచాయతీ పారిశుద్ధ్య వాహనం ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. బేకరీ యజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు ఆహార భద్రత అధికారి తెలిపారు. బేకరీని పూర్తిగా పరిశుభ్రంగా ఉంచి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ముడి సరుకులను సమకూర్చిన అనంతరం మాత్రమే తిరిగి ప్రారంభించాలని సూచించారు. అప్పటివరకు బేకరీ లైసెన్సులు రద్దు చేయనున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బేకరీ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు అరుదైన పురస్కారాలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండలంలో 2026/27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను మండల విద్యాధికారి టి.సురేందర్ రెడ్డి ప్రకటించారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శనివారం స్థానిక శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఫంక్షన్ హాల్లో ఘనంగా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకకు సంబంధించిన పురస్కార గ్రహీతల వివరాలు ప్రాథమిక పాఠశాలల విభాగంలో ఎంపీపీఎస్ కొమ్మాయిగూడెం కె.కోటేష్, ఎంపీయుపిఎస్ శోభనాద్రిపురం పి. కళావతి, ఎంపీపీఎస్ వెల్లంకి ఎం.వెంకటయ్య, ఎంపీపీఎస్ ఎన్నారంఎస్ కే.మస్తాన్, ఎంపీయుపిఎస్ హెచ్ డబ్ల్యు రామన్నపేట బి.సునీత, ఉన్నత పాఠశాలల విభాగంలో జడ్పిహెచ్ఎస్ కొమ్మాయిగూడెంబి బాలరాజు, జడ్పిహెచ్ఎస్ జనంపల్లి ఆర్.శంకర్, జడ్పిహెచ్ఎస్ ఎన్నారంఎన్. శేఖర్, జడ్పిహెచ్ఎస్ ఇంద్రపాలనగరం కె.శ్రీనివాస్ రెడ్డి, జడ్పిహెచ్ఎస్ మునిపంపుల ఎన్. మనోహర్, జడ్పిహెచ్ఎస్ వెల్లంకి కసాని స్వప్న, జిల్లా ఉత్తమ పురస్కార గ్రహీతలుగా ఎంపీపీఎస్ దుబ్బాక కె.లలిత, ఎంపీపీఎస్ జనంపల్లి కె.సందీప్ కుమార్, ఎంపీపీఎస్ రామన్నపేట బిసి కాలనీ వి.జనార్ధన్.'బడిబాట'లో అత్యధిక విద్యార్థుల నమోదు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జడ్పిహెచ్ఎస్ ఇంద్రపాలనగరం కె.శేఖర్, ఎంపీయుపిఎస్ శోభనాద్రిపురం జి.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీఎస్ బాచుప్పల వి.వెంకటయ్య, విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను, బడిబాట కార్యక్రమంలో విశేష కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను అభినందించడానికి ఈ కార్యక్రమం వేదిక కానుంది. మండలంలోని ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి టి.సురేందర్ రెడ్డి కోరారు.

## భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభ స్వామి వ్రతం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యాద్గార్‌పల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయంలో అనంత పద్మనాభ స్వామి వ్రత మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, నల్లగొండ జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి మమత దంపతుల పర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పురోహితులు స్వామి వారి వ్రత ప్రాశస్త్యాన్ని, విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం గ్రామ సుభిక్షం, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా భాద్రపద మాసంలో వచ్చే ఈ పవిత్ర వ్రతాన్ని నిర్వహించడం వల్ల గ్రామంలోని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దుండిగాల యాదమ్మ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మేరెడ్డి సుగుణ, గ్రామ నాయకులు చింతరెడ్డి కరుణాకర్ రెడ్డి, గుంటి గోపి, మాధురి శేఖర్ రెడ్డి, కె. పద్మాకర్ రెడ్డి, నాగేందర్, అశోక్, ప్రశాంత్, ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ ఎస్‌జిఎఫ్ఐ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ,సైదులు యాదవ్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ,పట్టుదల,నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు శారీరక దారుఢ్యం వృద్ధి చెందుతుందన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కె. శ్రీనివాస్,మత్స్యకార సంఘం చైర్మన్ పిట్టల కృష్ణ ముదిరాజ్, రిటైర్డ్ పీఈటీ పసుపులేటి నరసింహారావు, పీడీలు సత్యనారాయణ,వెంకట్రామిరెడ్డి,ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల పీఈటీలు ,మహిళా పీఈటీలు, గ్రామస్తులు నల్లబోతు వెంకటేశ్వర్లు, జూపల్లి గోపి పాల్గొన్నారు.



## రామన్నపేటలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 17వరకు నిర్వహిస్తున్న 'సేవ సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం నల్గొండ జిల్లా యువ నాయకులు అక్కేనపల్లి సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యువకులు,పెద్దలు,మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెవైఎం నల్గొండ జిల్లా యువమోర్చా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ యాదవ్,బీజేపీ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మైల నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ల సంజీవరెడ్డి,జయరపు రామకృష్ణ,బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నెగంటి వెంకటేశ్వరాచారి,మాజీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ,మండల కార్యదర్శులు భాత్క నరేష్,రేపాక లింగుస్వామి, సీనియర్ నాయకులు డాగుపర్తి సుభాష్ పాల్గొన్నారు.

## త్రిఫ్ట్,నేతన్న భరోస డబ్బలు వచ్చే నెలలో ఖాతాలో జమకు సిఎం హామీ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** త్రిఫ్ట్,నేతన్న భరోస డబ్బలు వచ్చే నెలలో నేత కార్మికుల ఖాతాలో జమచేస్తానని సిఎం హామి ఇచ్చినట్లు పోచంపల్లి చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన పోచంపల్లి సంఘ సభ్యులతో కలిసి పలు చేనేత సమస్యల పరిష్కారం, అదేవిధంగా మే నెల నుండి ఆగస్ట్ వరకు కార్మికులకు జమకావాల్సిన డబ్బులు విడుదల విషయమై ఆందోళన చెందుతున్న నేపథ్యంలో కలెక్టర్,ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్ళినప్పటికి స్పందన లేకపోవంటతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన దరిమిల తొలి సమావేశంలోనే సమస్యల పరిష్కారానికి బరోసా ఇచ్చినట్లు తెలిపారు. నేతన్నలు ఆందోళనకు గురికావొద్దని విజ్ఞప్తి చేశారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



**ప్రజాపక్షం/వేములపల్లి:** బాల్య వివాహాలు అక్రమ దత్తత చట్ట రీత్యా నేరమని శెట్టిపాలెం సర్పంచ్ పెదపంగా సైదులు అన్నారు. శెట్టిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఇటిక్యాల 1,2 అంగన్వాడీ కేంద్రాలలో 9వ పోషణ మాస కార్యక్రమంలో అంగన్వాడీ సూపరవైజర్ పరిమి రజిని తో కలిసి పాల్గొనిమాట్లాడారు. పరిమి రజిని మాట్లాడుతూ గర్భిణీలు బాలింత తల్లులకు పోషకాహారం అవసరం అని ప్రతిరోజు భోజనంలో సామలు కొర్రలు అరికెలు పప్పులు పాలకూర తోటకూర గోంగూర మునగాకు వంటి ఆకుకూరల ప్రత్యేకతను గురించి వివరించారు, చిన్నపిల్లలు జంక్ ఫుడ్ తీసుకుంటే అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఎక్కువని అన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ నీలం సత్యనారాయణ,ప్రైమరీ స్కూల్ టీచర్ పెద్దమాం ఝాన్సీ,పంచాయతీ సెక్రెటరీ నవీన్ రెడ్డి,అంగన్వాడీ టీచర్స్ యాదమ్మ,సుభద్ర, విమల,ఆశా వర్కర్లు నాగమ్మ,రేణుక,ఆయా జిలేంద్ర పాల్గొన్నారు.

## పరామర్శ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని చాడ గ్రామంలో చాడ కృష్ణదేవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవల్ల యాకుబ్‌లు మృతి చెందడంతో మృతుల భౌతికకాయాలకు మేడం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవల్ల యా కూబ్ కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.



## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన గడ్డం సుశీల అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ మానవ సేవే మాధవ సేవా అనే నినాదంతో మృతురాలి కుటుంబానికి శుక్రవారం రూ. 5016లను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో సర్పంచ్ మహోదయ్, ఉప సర్పంచ్ నగేష్, వార్డు సభ్యులు జయమ్మ, భరత్, దయాకర్, శ్రీశైలం, స్వామి పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బురుజుబాయి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసిడిఎస్ మోత్కూర్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ యాక్‌పాషా బేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణిలకు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు పద్మ, వాసవి, కవిత, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

## పోషణ మాసం



**ప్రజాపక్షం/డిండి;** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసంలో భాగంగా శుక్రవారం గోనకోల్, పాత గోనకోల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ రేణుక హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లీలమ్మ, చంద్రకళ, గ్రామ పెద్దలు, మహిళలు, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

## భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామంలో రీసర్వే నిర్వహించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం గోగువాణిగూడెం గ్రామ పంచాయతీలో గోగువాణిగూడెం గ్రామ రీసర్వేపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఆర్డీవో రమణారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంలో భాగంగానే గ్రామాల్లో ఈ రీసర్వే చేపడుతున్నట్లు చెప్పారు. దీని ద్వారా ప్రతీ రైతుకు తన భూమికి సంబంధించి స్పష్టమైన హద్దులు ఏర్పడతాయని వివరించారు. రైతులు ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సర్వే నిర్వహించడానికి వచ్చే అధికారుల



బృందాలకు గ్రామస్తులు, రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రతీ ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు, విఆర్వోలు, సర్వేయర్లు, గ్రామ సర్పంచ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా బిసిలకే అవకాశం కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** త్వరలో జరగనున్న నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులకే అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో కేవలం ఐదు శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ప్రాధాన్యత ఇస్తూ, 50 శాతానికి పైగా ఉన్న బీసీలను అన్ని పార్టీలు తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని విస్మరించడం సరికాదని పేర్కొన్నారు.నేడు బీసీ పట్టభద్రులందరూ రాజకీయంగా ఎంతో చైతన్యవంతమయ్యారని, తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈసారి జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ తప్పకుండా బీసీ అభ్యర్థులను రంగంలోకి దించాలని సూచించారు. అలా కాకుండా బీసీలకు టికెట్ కేటాయించని పార్టీలకు రాబోయే ఎన్నికల్లో బీసీ పట్టభద్రులంతా ఏకమై ఓటు వేటు ద్వారా తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. చట్టసభల్లో బీసీల భాగస్వామ్యం పెరిగినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని వెల్లడించారు.ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా, మండల నాయకులు, బీసీ విద్యార్థి, పట్టభద్రుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమీక్ష



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఎంపీడీఓ రామకృష్ణ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని సర్పంచ్ ఆవేదన మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో ఏడాదిగా మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ ఇరుగు రాణి వెంకటయ్య సమావేశంలో లేవనెత్తారు.గత ఏడాదిగా మా గ్రామానికి నీళ్లు రావడం లేదు.ఇది రాజకీయమా,పక్షపాతమా,అధికారుల నిర్లక్ష్యమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.మరో 15 రోజుల్లో నీరు సరఫరా చేయకపోతే ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తానని హెచ్చరించారు.దీనిపై స్పందించిన ఎంపీడీఓ 15 రోజుల్లో నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు,సీడీపీఓ సక్కుబాయి,ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఓ మధు,కరెంటు ఏఈ,ఆర్అండ్‌బి ఏఈ,పీఆర్ ఏఈ,మిషన్ భగీరథ ఏఈలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల విద్యాధికారి రమావత్ రవినాయక్ తో పాటు వివిధ పాఠశాలలకు చెందిన మండలంలోని ఎనిమిది మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.అదేవిధంగా త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 2025/2026 విద్యా సంవత్సరంలో 600మార్కులకు గాను 566మార్కులు సాధించిన విద్యార్థిని తేజస్విని గవర్నర్ చేతుల మీదుగా రూ. ఒక లక్ష పారితోషకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన తేజస్వినిని శాలువా కప్పి




సన్మానించారు. అదేవిధంగా రైతుబంధు సమన్వయ సమితి జిల్లా మాజీ డైరెక్టర్ అనుముల శ్రీనివాస్ డ్డి విద్యార్థినికి రూ.5000 పారితోషకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భైరం కృష్ణ, మాజీ ఎంపీటీసీ మజ్జిగపు వెంకట్ రెడ్డి,అనుముల శ్రీనివాస్ రెడ్డి,అనుముల శ్యాంసుందర్ రెడ్డి, బిచ్చునాయక్,రాయినబోయిన వెంకన్న,జంగిలి శ్రీనివాస్‌రెడ్డి, జంగిలి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

**రూ. 1,42,116లు పలికి లడ్డూ**

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల నల్లచేలమూల గ్రామంలో శుక్రవారం వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూ వేలం పాటలో భాగంగా మొదటి లడ్డూను రూ. 1,42,116లకు రావుల వెంకటయ్య దక్కించుకోగా, రెండవ లడ్డూను రూ. 86వేలకు పోలగోని వెంకన్న దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూలను దక్కించుకున్న వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.





## సిఎం సహాయ నిధి పేదలకు వరం

**ప్రజాపక్షం/చండూరు:** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరం లాంటిదని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మున్సిపాలిటీ నాల్గవ వార్డు కౌన్సిలర్ జెల్ల ధనమ్మశ్రీనివాసులు అన్నారు. సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సహకారంతో మున్సిపాలిటీకి చెందిన నల్పరాజు పుష్పలతకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం చండూరులో లబ్ధిదారుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొంది పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరు సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యవర్గ సభ్యులు దోటి వెంకన్న, జెల్ల శ్రీను , అందిర్క పరమేష్ , ఇరిగి రామకృష్ణ పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మిర్యాలగూడ మండలం పెద్దతండా పరిధిలోని కేజీఆర్ కాలనీ, దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ధనావత్ మంగ్తా (61) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం బ్యాంకు పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మిర్యాలగూడ పట్టణానికి వచ్చారు. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో టీ తాగడం కోసం హనుమాన్ పేట ఫ్లైఓవర్ వద్దకు చేరుకున్నారు.అదే సమయంలో సాగర్ రోడ్డు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ షేక్ ఖాజా లారీని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఒక్కసారిగా ఎడమవైపునకు తిప్పాడు. దీంతో లారీ ముందు టైరు మంగ్తా తల మీదుగా వెళ్లడంతో తల పగిలి తీవ్ర రక్తస్రావమై ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు ధనావత్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ టూటౌన్ ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలి

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శుక్రవారం మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని మండల తహశీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ స్థానిక సర్పంచ్ నల్లగంతుల రవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయకుడి వద్ద పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవ కమిటి సభ్యులు శాలువాతో సన్మానించారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని నీలా విజయలక్ష్మి నగేష్ దంపతులు, కొరివి నవీన్‌కుమార్ దాతల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు మల్లేష్, బన్నీ, రమేష్, పరమేష్, వార్డు సభ్యులు పావనిసైదులు, సంజు, రాకేష్, నీరజ్, మహేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, వరుణ్, ముస్లీం, మైనార్టీ అధ్యక్షులు ఖలీమ్ పాల్గొన్నారు.





## ఎస్‌పి బాలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సినిమా రంగ పాటలు ఉన్నంత కాలం గాన గంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా ఉంటాడని మనమ్ వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్నేహ నిలయంలో బాలసుబ్రహ్మణ్యం 6వ వర్ధంతిని పురస్క రించుకొని బొమ్మల నాగరాజు ఆధ్వర్యంలో వయోవృద్ధులకు పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమంలో మాట్లాడారు. 13వ వార్డు కౌన్సిలర్ భూక్య కౌసల్య మహేష్, 29వ వార్డు కౌన్సిలర్ రాపర్తి భవానిశ్రీనివాస్, 40వ వార్డు కౌన్సిలర్ రాజేష్ రెడ్డి, పాల్గొన్నారు.

## తరతరాలకు స్ఫూర్తి వందేమాతరం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : తరతరాలకు స్ఫూర్తి వందేమాతర గేయమని పలువురు వక్తలు అన్నారు. వందేమాతరం గేయం రచించి 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని చందన కళాశాల, శ్రీసరస్వతి విద్యానిలయం, సిటి టాలెంట్ పాఠశాలలో నమామి భారతం వందేమాతర సామూహిక గానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్, గట్ల సోమయ్య, కె. మధుసూదన్ రెడ్డి, యానాల వెంకటరెడ్డి, దశరథ, కుమార స్వామి, కవిత పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

ప్రజాపక్షం/నకిరేకల్: వ్యవసాయానికి రోజుకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు.నకిరేకల్,కట్టంగూరు,కేతేపల్లి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, మరోవైపు విద్యుత్ సరఫరాలో కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రోజులో పరిమిత సమయమే విద్యుత్ సరఫరా అవుతుండటంతో పంటలకు సకాలంలో నీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు గంజి మురళీధర్,బొజ్జ చినవెంకులు,మండల కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, పెంజర్లసైదులు,బూర్గుమారయ్య,ఒంటెపాక వెంకటేశ్వర్లు,మోహన్,జానకి,కొంటెపాక కృష్ణ,మర్రి వెంకటయ్య పాల్గొన్నారు.



## కిరాయి చెల్లించలేదని ఈఎస్‌ఐ ఆసుపత్రికి తాళం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సుదీర్ఘకాలంగా భవన కిరాయి చెల్లించకపోవడంతో మిర్యాలగూడలోని ఈఎస్‌ఐ ఆసుపత్రికి తాళం వేశారు. శుక్రవారం పట్టణంలోని పాత లలిత టాకీస్ సమీపంలోగల భాగ్యలక్ష్మి కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీ భవనానికి యజమాని కర్నాటి కృష్ణ తాళం వేసి నిరసన తెలిపి మాట్లాడారు. గత 18 నెలలుగా ఆసుపత్రి భవన కిరాయితో పాటు విద్యుత్ బిల్లుల బకాయిలు మొత్తం రూ.15 లక్షల వరకు రావాల్సి ఉందని తెలియజేశారు. ఇందులో విద్యుత్ బిల్లుల బకాయిలే రూ.1,75 వేలు ఉన్నాయని పేర్కొన్నారు. భవన కిరాయి విషయమై పలుమార్లు ఈఎస్‌ఐ ఉన్నతాధికారులను కోరినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ముందస్తుగా నోటీసులు ఇచ్చి భవనానికి తాళాలు వేయాల్సి వచ్చిందని తెలిపారు. చికిత్స కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున మానవతా దృక్పథంతో ఆలోచించి ఈ నెల 29 సోమవారం వరకు గడువు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆలోగా చెల్లించవలసిన




కిరాయి బకాయిలను పూర్తిగా చెల్లించని పక్షంలో ఈ నెల 30 నుండి శాశ్వతంగా ఆసుపత్రి భవనానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఈ ఆసుపత్రి పరిధిలో సుమారు 45 వేల మంది కార్మికులు నమోదై వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ 100 నుండి 200 మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బకాయిల సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి



ప్రజాపక్షం/దేవరకొండ: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్టి, ఎస్సి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కమ్మేపల్లి గిరిజన బాలుర పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్, తాగునీరు, విద్యుత్, డార్మిటరీ హాల్ వంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థులు తెలుపగా దీనిపై స్పందించిన చైర్మన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తామన్నారు. విద్యార్థుల్లో మట్టిలో మాణిక్యాలు ఉంటారని, రేపటి బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని, భవిష్యత్తులో లాయర్లు, ఎస్పీలు, డిఎస్పీలు వంటి ఉన్నత పదవులు చేపట్టేలా విద్యార్థులు ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కమిషన్ సభ్యులు రాంబాబునాయక్ మాట్లాడుతూ వెనుకబడిన గిరిజన జాతి ప్రాంతం విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి సూచిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో కమిషన్ సభ్యులు ప్రవీణ్, లక్ష్మీ నారాయణ, శంకర్, డిటిడివో కమలాకర్‌రెడ్డి, ఆర్‌సివో నర్సింహారావు, ఏటిడివో వెంకటేశ్వర్లు, ఏసిఎంవో వెంకటేశ్వర్లు, ఎంపిడివో పార్వతి, ప్రిన్సిపల్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ జట్లకు క్రీడాకారుల ఎంపిక

### ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 400 మంది హాజరు

ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్): మండలం చెరువుఅన్నారం ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్14,17 బాలబాలికల హ్యాండ్ బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కందాల రమ సారథ్యంలో జరిగిన ఎంపికలకు నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి,గ్రామ సర్పంచి చిలుముల సైదులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని,విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు హ్యాండ్‌బాల్ ఎంపికల్లో పాల్గొన్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు.ఈకార్యక్రమంలో నల్లగొండ డివిజన్,నకిరేకల్ నియోజకవర్గ క్రీడల కన్వీనర్లు తాళ్ల శ్రీనివాస్, సంధ్యాల రాజశేఖర్‌రెడ్డితోపాటు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రఘువీర్ సింగ్,కవిత,జ్యోతి,లక్ష్మి,రాజ్యలక్ష్మి,శ్రీనివాస్ రావు,యాదయ్య, కేశనాగులు,పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి,శ్రీనివాస్,కోటిలింగం,నరహరి,నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యా సంస్థల ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ సబ్ కలెక్టర్ కోరోలిన్ చింగ్తియాన్ మావి శుక్రవారం దేవరకొండ కొండభీమనపల్లి పరిధిలోని మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల కళాశాల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో వంట గది, కళాశాల పరిసరాలు పర్యవేక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందుతున్నాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ తో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, వసతి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. హాస్టల్‌లను, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు.





## పేదల సొంతింటి కల సాకారం

### 211 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ప్రజాపక్షం/కోదాడ: పేద, నిరుపేద కుటుంబాలకు సొంత ఇల్లు ఉండాలనే కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ ప్రక్రియను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో భాగంగా 211 ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలిదశలో జీరో నుంచి 100 గజాల లోపు స్థలంలో నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేకుండా గుడిసెలు, మట్టిగోడలు, తార్పాలిన్లతో ఏర్పాటు చేసుకున్న ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి అర్హత ఆధారంగా ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా 100 గజాల నుంచి 200 గజాల వరకు స్థలం ఉన్న కుటుంబాల వివరాలను ప్రస్తుతం పరిశీలిస్తున్నామని, క్షేత్రస్థాయిలో పూర్తి చేసి, విచారణ అనంతరం అర్హులను గుర్తించి తదుపరి జాబితాలో ఇందిరమ్మ ఇళ్లకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## లక్కీ డ్రాలో సిఎం రేవంత్ రెడ్డి పేరు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : కాసం మణియాత్ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన లక్కీ డ్రాలో సిఎం రేవంత్ రెడ్డి పేరు విజేతగా రావడం ఆసక్తికరంగా మారింది. తోనుకునూరు సాయికుమార్ లక్కీ డ్రా కోసం సిఎం రేవంత్ రెడ్డి పేరుతో చీటి రాయగా, అదే చీటి విజేతగా ఎంపికైంది. కమిటి ఆధ్వర్యంలో లక్కీ డ్రా బహుమతులుగా రూ.25వేల నగదు, 15 కిలోల లడ్డును ఏర్పాటు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి పేరు చీటి విజేతగా రావడంతో సాయికుమార్‌కు రూ.25వేల నగదు బహుమతి లభించింది. అయితే ఆ నగదును తన వద్ద ఉంచుకోకుండా కమిటి సభ్యులకు తిరిగి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటి సభ్యులు కాసం మణి, రామ్‌సాయి, ఎస్. మధు, మామిడి ప్రవీణ్, నారగోని రోహిత్, కాసం విష్ణు పాల్గొన్నారు.

## అమృత రామానుజరావు ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/కోదాడ: ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రతిభ గల నిరుపేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహన్ని అందిస్తున్న అమృతరామానుజ రావు ట్రస్టు సేవలు అభినందనీయమని కెఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కెఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఏడు గురు జూనియర్ కళాశాల విద్యార్థులకు, ముగ్గురు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బంగారు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎఆర్‌టి వ్యవస్థాపకులు తమ ప్రాంతానికి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ట్రస్టు చైర్మన్ కొండపల్లి శేషు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రతిభ గల విద్యార్థులకు పురస్కారాలు అందించడంతో పాటు నైపుణ్యం పెంచేందుకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వేముల వెంకటేశ్వర్లు, మంత్రిప్రగడ శ్రీధర్, అక్కిరాజు యశ్వంత్, కొండపల్లి రంగారావు, వనం నాగేశ్వరరావు పాల్గొన్నారు.





## వయోవృద్ధులు నిరాదరణ కాకుండా చూసుకోవాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి** : వయోవృద్ధులు నిరాదరణకు లోను కాకుండా వారి కుటుంబ సభ్యులు చూసుకోవాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలలో జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం 30 సంవత్సరాల పైబడిన వారికి అసంక్రమణ వ్యాధులకు గురయ్యే ఆస్కారం ఉన్నందున సకాలంలో పరీక్షలు చేసుకుని ఏమైనా జబ్బులు నిర్ధారణ అయితే మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్ మాధవి, ఫార్మసీ ఆఫీసర్ అనూష, వయోవృద్ధులు పాల్గొన్నారు.

### భక్తిభావాన్ని కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/నూతనకల్** : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఏసిఎస్ మాజీ చైర్మన్ కనకటి వెంకన్న ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్న మల్లయ్య యాదవ్, దావుల వీరప్రసాద్, బత్తుల సాయిల్ గౌడ్, జక్కి పరమేష్, పెద్దింటి మధు, గాజుల తిరుమల్‌రావు, కప్పల రామ్మూర్తి, మన్యం రమేష్, సైదులు పాల్గొన్నారు.

### ఘనంగా శోభాయాత్ర



**ప్రజాపక్షం/నూతనకల్** : మండల కేంద్రంలోని చింతబజార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని శోభాయాత్ర శుక్రవారం భక్తిశ్రద్ధలతో గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టారు. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని నామస్మరణలతో సందడి చేశారు. భక్తి గీతాలు డప్పు వాయిద్యాల నడుమ శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో చింత బజార్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పేద కుటుంబాలకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : గత కొన్ని ఏండ్లుగా ప్రభుత్వ భూమిలో సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎస్సి, ఎస్టీ నిరుపేద కుటుంబాలకు పట్టా చేసి వారికి న్యాయం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండలంలోని ములకలపల్లి గ్రామంలోని 92, 93 సర్వే నంబర్‌లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు గత 100 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో తాతల కాలం నుండి ఆ భూమిలో సాగుచేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని కోరారు.

## బిఆర్ఎస్ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టే ప్రయత్నం



**ప్రజాపక్షం/సూర్యాపేట** : సెప్టెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ ఇంచార్జి భవ్యతో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు బిఆర్ఎస్ పార్టీ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అయితే పట్టభద్రులు గత పాలనను దృష్టిలో ఉంచుకుని తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజక వర్గం, ప్రతి మండలం, ప్రతి పట్టభద్రుడి వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జి సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్, నవీన్ ఆచారి, కొత్త విద్యరెడ్డి, శ్రావ్యరెడ్డి పాల్గొన్నారు.

## చెరువులు, కుంటలోకి చేరుతున్న వరదనీరు



**ప్రజాపక్షం/అనంతగిరి:** బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండల వ్యాప్తంగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దాదాపు అన్ని గ్రామాలలో మోస్తారు మంచి భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వానలు లేక ఎండిపోతున్న చెరువులు, కుంటల్లోకి క్రమంగా వరదనీరు వచ్చి చేరుతుంది. ఈ సీజన్ ఆరంభం నుంచి సరైన వర్షపాతం లేక కరువు మేఘాలు అలుముకున్న వేళ ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలు ఆపద్బాంధవుడుల మారాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ సీజన్‌లో తీవ్ర లోటు వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరక ఎడారిని తలపించాయి. తాజాగా బుధవారం తెల్లవారుజామున నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాయిలసింగారం రిజర్వాయర్ త్రిపురవరం, పాలారం, కృష్టాపురం, అనంతగిరి, వంసతాపురం, గొండ్రియాల, లకారం శాంతినగర్ గ్రామాల్లో చెరువులకు మళ్లి పూర్వ వైభవం సంతరించుకుంది. చెరువుల్లోకి బారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో అలుగులు పోస్తున్నాయి. వర్షాలు ఇలాగే రెండు రోజులు కొనసాగితే మండలంలోని చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉండటంతో యాసంగి పంటకు సాగునీటి కొరత తీరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### మొక్కలు నాటాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో శుక్రవారం బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఫీల్డ్ ఆఫీసర్ ప్రభాకర్ సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి నాటిన మొక్కను సంరక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, సాయి కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం

**ప్రజాపక్షం/నకిరేకల్:** పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చందుపట్ల గ్రామ సర్పంచ్ దిగోజు లత వెంకటాచారి అన్నారు. మండలం లోని చందుపట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ అభియాన్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచి ఓరుసు మంజుల శ్రీను, వార్డు సభ్యుడు జిల్లా నాగయ్య,అంగన్‌వాడీ టీచర్లు కలుకూరి సూర్యకళ,మామిళ్లపల్లి నాగమణి,ముత్తమ్మ,ఆశ కార్యకర్త ఇందిర, గ్రామస్థులు పాల్గొన్నారు.



### బిక్కేరువాగులో ఎమ్మెల్యే పూజలు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : బిక్కేరువాగు ధర్మారం చెక్ డాం వద్ద ఎమ్మెల్యే శుక్రవారం పూజలు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెక్ డాం అలుగుపోస్తుంది సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు రెండు పంటలకు ధీమా వ్యక్తం చేశారు.

### చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నాంపల్లి** :మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన 46 చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.తహసీల్దార్ అంబటి ఆంజనేయులు చేతుల మీదుగా ఈ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ దోటి వెంకన్న,రెవెన్యూ అధికారులు,వడ్డేపల్లి సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు, వార్డు సభ్యులు జెట్టనబోయిన శంకర్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



## రాష్ట్రీయ పోషణ్ మాస్ వేడుకలు

**ప్రజాపక్షం/నాంపల్లి** :ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ మాస్ (జాతీయ పోషకాహార మాసోత్సవం) కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మన అంగన్‌వాడీమన బాధ్యత అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. తహసీల్దార్ అంబటి ఆంజనేయులు,అన్ని గ్రామాల సర్పంచులు,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి,వసంత,అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

### పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/త్రిపురారం** : సమతుల్య,పోషకాహారం తీసుకోవడం వల్లనే తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు.మండలంలోని సత్యనారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ మాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత,పంచాయతీ కార్యదర్శి శివ, అంగన్‌వాడీ టీచర్లు శ్రావణి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పోచంపల్లి శాఖలో ఖాతాదారుడు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీపతి సిద్ధి రాములు వారసులకు శుక్రవారం న్యూఇండియా ఇన్సూరెన్స్ సౌజన్యంతో అందిస్తున్న జిజేపిఎ ప్రమాద పాలసీ మొత్తం రూ.ఒక లక్షా చెక్ ను ఆ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అందజేశారు.బ్యాంకు సిఈవో సీత శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ రకాల పాలసీను ఖాతాదారులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మికుల ఖాతాలో జమచేస్తానని సిఎం హామి ఇచ్చినట్లు పోచంపల్లి చేనేత కార్మిక డైరెక్టర్స్ తదుతరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భారత రాజేంద్ర ప్రసాద్ డైరెక్టర్స్ కర్నాటి బాలసుబ్రమణ్యం ఏలే హరిశంకర్ సూరెపల్లి రమేష్ రాపోలు వేణు గుండు కావ్య కర్నాటి బార్గవి బిట్టు భాస్కర్ మక్తాల నర్సింహ్మా సీనియర్ మేనేజర్‌రచ్చ శ్రీనివాస్ వల్లకీర్తి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

### గురుపూజోత్సవ కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా గుండాల మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ నీలిమ, సర్పంచ్ దేవనబోయిన అయిలయ్య, మండల విద్యాధికారి అగ్గిరాములు, కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రకళ, పిఆర్‌టియూ అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి బాలరాజు, యూటిఎఫ్ అధ్యక్షులు వెంకటేష్, లింగయ్య, హన్మంత్, రామకృష్ణ, నరేష్, సునీల్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

